క్లుప్తంగా

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

కొడవలూరు: కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం మండలంలోని నార్తురాజుపాళెంలో సీపీఎం నేతలు శనివారం విరాళాలు సేకరించారు. పలువురు అధికారులు, నాయకులు, వ్యాపారులు, గ్రామస్తులు స్వచ్ఛందంగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ మాట్లాడుతూ వయనాడ్‌లో వరదల కారణంగా అక్కడి ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారికి తమవంతు సాయంగా విరాళాలు సేకరించి అందజేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తలారి నరసింహం, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జేష్ఠ మాసం ఆఖరి శనివారం స్వామి, అమ్మవార్ల పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకాలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

• మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమంలో శనివారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు ముందుగా పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. కార్యక్రమాలకు గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

• పొదలకూరు: పట్టణంలోని శ్రీగంగమ్మతల్లి కొలుపులో భాగంగా రెండోరోజు శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం జరిగింది. యాదవరాజులు వీరతాళ్ల అడుగులతో అత్యంత వైభవంగా నిర్వహించారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నెల్లూరు సిటీ: ఏఎస్‌పేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1982 – 83 మధ్య చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. నాటి స్మృతులను నెమరేసుకున్నారు. నగరంలోని మినర్వ గ్రాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాగిరెడ్డి, రేణుక, శ్రీనివాసులు, సులోచన తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు సిటీ: కల్కి జయంతిని పురస్కరించుకొని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మార్గంలోని కల్కి అవతారం వద్ద ప్రత్యేక పూజలను శనివారం నిర్వహించారు. కాగా స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి అభిషేకం, తిరుప్పావై సేవ తదితర పూజలను ఆదివారం నిర్వహించనున్నారు. ఇన్‌చార్జి ఈఓ సుధీర్, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): హృద్రోగ సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ సాహెబ్ పీర్ మాట్లాడారు. వ్యాధిపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్, అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, చింతల అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు కేజ్‌వీల్స్ గండం

- రైతులకు అవగాహన చాలా అవసరం
- అధికారులు దృష్టి సారించాలి

కేజ్‌వీల్స్ ఉన్న రైతులు : సుమారు **200**కు పైగా..

మెయిన్ రోడ్లు : **80** నుంచి వంద కిలోమీటర్లు



కేజ్‌వీల్స్‌ను అమర్చుకుని రహదారిపై వెళ్తున్న ట్రాక్టర్

కొడవలూరు: ఒకప్పుడు పొలాన్ని దున్నేందుకు రైతులు పశువులను వినియోగించేవారు. కాలక్రమేణా వ్యవసాయ యాంత్రీకరణలో గణనీయమైన మార్పులు రావడంతో అనేకమంది ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. మరికొందరు ట్రాక్టర్లను అద్దెకు తెచ్చుకుని సాగు పనులకు వాడుతున్నారు. అయితే పలువురు కేజ్‌వీల్స్‌ను రోడ్డుపై యథేచ్ఛగా నడిపేస్తున్నారు. దీంతో రహదారులు దెబ్బతింటున్నాయి. వాటిపై ప్రయాణం నరకయాతనగా ఉంటోంది. అన్నదాతల్లో చైతన్యం కల్పించడం ద్వారానే ఈ సమస్యకు కళ్లెం పడుతుంది. ఆ దిశగా ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు ప్రయత్నించాల్సి ఉంది.

మండలాల పరిధిలో ప్రతి గ్రామంలో ట్రాక్టర్లున్నాయి. వ్యవసాయ పనులు జరిగే సమయంలో రైతులు వాటిని అధికంగా వినియోగిస్తుంటారు. కొందరు కేజ్‌వీల్స్‌తో ఇష్టారీతిన తిరుగుతుండడంతో రహదారులకు గండంగా మారింది. వీటిని నియంత్రించడం అధికారులకు సవాలుగా మారింది. ఒకవేళ పట్టుకున్నా ప్రజాప్రతినిధుల ఒత్తిడితో వాటిని వదిలేసే పరిస్థితులున్నాయి. రక్షణగా పట్టీలు, ట్రాలీలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నా ఇవేమీ పట్టనట్లుగా ట్రాక్టర్ యజమానులు ఇష్టారీతిన రహదారులపై తిప్పుతున్నారు. సంవత్సరాలపాటు నిలవాల్సిన రహదారులు నెలల వ్యవధిలోనే పూర్తిగా దెబ్బతింటున్నాయి.

ఇలా చేస్తే..

కేజ్‌వీల్స్ అవసరమైనప్పుడు వాటిని ట్రాక్టర్ ట్రక్కులో పొలానికి తీసుకెళ్లి పని పూర్తయ్యాక తిరిగి ట్రక్కులోనే వేసుకుని ఇంటికి చేర్చాలి. కానీ అలా చేయకుండా చాలామంది ఇంటి వద్దే ట్రాక్టర్ చక్రాల స్థానంలో నేరుగా కేజ్‌వీల్స్‌ను అమర్చుకొని రోడ్లపై తిరిగేస్తున్నారు. వీటి కారణంగా తారు రోడ్లు అనతి కాలంలోనే దెబ్బతింటున్నాయని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అవి ఇనుప చక్రాలు కావడం, బాగా పదునుగా ఉండడం వల్ల రోడ్డుపై దిగబడుతున్నాయి. తొలుత గీతలు వలె లోతుగా పడి ఆ తర్వాత వాహనాలు తరచూ తిరగడం వల్ల గుంతలుగా మారుతున్నాయి.

రైతుల్లో చైతన్యం పెంచాలి

కేజ్‌వీల్స్ కారణంగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌కి చెందిన తారు రోడ్లే సింహ భాగం దెబ్బతింటున్నాయి. ఆయా శాఖల అధికారులు రైతుల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాలి. అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి కేజ్‌వీల్స్‌ను రోడ్లపై నడపడం వల్ల వచ్చే నష్టాలను వివరించాలి. రహదారులు అనతికాలంలోనే దెబ్బతినడం వల్ల వెంటనే పునరుద్ధరించే వీల్లేక గుంతలమయంగా వాటిపైనే ప్రయాణించాల్సి వస్తోందన్న విషయాన్ని వారికి తెలియజేయాలి. కొందరు రైతులు చేసే పొరపాటు



దెబ్బతిన్న బొడ్డువారిపాళెం లింక్ రోడ్డు

కారణంగా ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని వివరించాలి. ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయన్న విషయాన్ని చెప్పాలి. కానీ అధికారులు ఆ దిశగా యత్నిస్తున్న దాఖలాల్లేవు.

బాధ్యతగా ఉంటే..

రైతులు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కేజ్‌వీల్స్‌ను రోడ్లపై నడుపుతుండడంతో రూ.లక్షలు వెచ్చించి వేసిన రోడ్లు దెబ్బతింటున్న విషయాన్ని గ్రహించాలి. రోడ్లు గుంతలమయంగా మారడం వల్ల ఎంతోమంది ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలి. కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ ట్రక్కుల్లో వేసుకొని పొలంలోకి, ఇంటికి తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలి.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు

మనుబోలు: విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై విగ్రహంపై దాడి అమానుషమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. బాబాసాహెచ్ విగ్రహంపై పచ్చమూకల దాడిని నిరసిస్తూ శనివారం మనుబోలు దళితవాడ వద్ద కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు పరిమళ శివరామకృష్ణ మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్యంపై దాడి అన్నారు. రిజర్వేషన్‌ల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం, ఉపాధి, ఉద్యోగావకాశాలు అందేలా చేసిన మహానుభావుడు అంబేడ్కర్ అని చెప్పారు. న్యాయ మహాశిల్పంపై దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలన్నారు. దాసరి భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి ప్రతీకగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయించాడన్నారు. ఆ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా దుండగులు దాడి చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చేతన్, మహేంద్ర, సాయి, శ్రీనివాసులు, సాకేత్, ప్రశాంత్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణ ముఖ్యం

• ఎంపీడీఓ మహ్మద్ రఫీ

పొదలకూరు: పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ ముఖ్యమైన అంశమని ఎంపీడీఓ మహ్మద్ రఫీ అన్నారు. సర్పంచ్‌ల మూడోరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, గ్రామ పంచాయతీల్లో గుర్తించిన అంశాలపై విశ్లేషణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ డి.దుర్గాదొరబాబు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

విడవలూరు: నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. మండలంలోని ముదివర్తి ఇసుక రీచ్ నుంచి శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రతిభా పురస్కారాల అందజేత నేడు

వెంకటాచలం: నెల్లూరు నగరంలోని టౌన్‌హాల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తారని గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం జిల్లా కార్యదర్శి కోసూరు సుబ్బయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ కోసూరు పద్మ గౌడ్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో 450 మార్కులకుపైగా సాధించిన వారికి నగదు బహుమతులు అందజేస్తారని తెలియజేశారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జి.కృష్ణకాంత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు.

కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఎన్నికలు నేడు

నెల్లూరు(అర్బన్): నెల్లూరు కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎన్నికలను ఆదివారం నిర్వహించనున్నామని పూర్వాధ్యక్షుడు, కార్యదర్శి ఐతా భాస్కర్, పేరూరి ప్రదీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగనాయకులపేటలోని ఐరన్ హార్డ్‌వేర్ అండ్ పెయింట్ మర్చంట్స్ అసోసియేషన్ భవన్‌లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలను నిర్వహించనున్నామని చెప్పారు. ఓటేసేందుకు వచ్చే వారు తమ పేరుపై ఉన్న లైసెన్స్, ఆధార్‌కార్డు కాపీలను తీసుకురావాలని కోరారు.

ఎంపీడీఓకు ఘన సన్మానం



ప్రద్యుమ్నకుమార్‌ను సన్మానించిన అధికారులు, ఉద్యోగులు

కొడవలూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ ప్రకాశం జిల్లా పర్చూరుకు బదిలీ అయిన వి.ప్రద్యుమ్నకుమార్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. తాజాగా యథాస్థానానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన విషయం తెల్సిందే. దీంతో ప్రద్యుమ్నకుమార్ రిలీవయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డీఏలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్‌ఎస్.లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్‌కుమార్, జి.జాలయ్య, అంకమరాణి, విజయలక్ష్మి, బ్రహ్మానందరెడ్డి, సురేష్, కార్యాలయ సిబ్బంది శీనమ్మ, వెంకటేష్, శీనయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

నెల్లూరు(టౌన్): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉంటుందన్నారు. మత్తు పదార్థాలకు బలి కాకుండా యువత జాగ్రత్త పడాలని కోరారు. మత్తు రహిత దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థ రహిత దేశాన్ని నిర్మిద్దామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐఓ శ్రీనివాసులు, ఎన్నెస్సెస్ వర్సిటీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ఎన్నెస్సెస్ కళాశాల ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు రవీంద్రనాథ్, రమణారెడ్డి, వెంకట్రావు, శ్రీధర్, పూర్ణచంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ర్యాలీ రేపు

నెల్లూరు(బృందావనం): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలని కోరుతూ నగరంలో శాంతియుత నిరసన ర్యాలీని సోమవారం నిర్వహించనున్నామని ఆర్సీఎం బిషప్ మోస్ట్ రెవరెండ్ ప్రకాశం తెలిపారు. సంతపేట రోమన్ క్యాథలిక్ మిషన్ క్యాథెడ్రల్‌లోని బిషప్ హౌస్‌లో క్రైస్తవ సంఘాల నేతలతో సమావేశాన్ని ఎస్సీ, బీసీ కమిషన్ సెక్రటరీ ఫాదర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వీఆర్సీ గ్రౌండ్స్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న ర్యాలీకి తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎలీషాకుమార్, దయాసాగర్, ఏసురాజ్యం, ఏసురత్నం పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ డేవిడ్



మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

• ఈఓపీఆర్డీ డేవిడ్

కొడవలూరు: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ స్పష్టం చేశారు. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజులుగా జరుగుతున్న శిక్షణ శనివారంతో ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో చేయాల్సిన పనుల గురించి శిక్షణలో సమగ్రంగా వివరించడం జరిగిందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్ మాట్లాడుతూ పంచాయతీల్లో తాగునీటి పథకాల నిర్వహణ ప్రధానమైందన్నారు. ఏవైనా పైపులైన్లు, పంపు షెడ్లు మరమ్మతులకు గురైతే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా నీటి పథకాల నిర్వహణ సాగాలని కోరారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా త్వరలోనే ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

• కోవూరు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు కృషి చేయాలని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర పరిశీలకురాలు రాజ్యలక్ష్మి తెలిపారు. కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామంజనేయులు, ఈఓపీఆర్డీ నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం దాని సభ్యులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్కు సెంటర్ వద్ద యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ విశేష కృషి చేసిందని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నాగిరెడ్డి, శ్రావణ్‌కుమార్, మాల్యాద్రి, వాణి, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

• కోవూరు: యూటీఎఫ్ నాయకులు మండలంలో శనివారం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. వివిధ చోట్ల పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. కోవూరు ఏరియా ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఖాజావలీ, భారతి, నాయకులు తిరుపాలు, మాలకొండయ్య,, రవిచంద్ర, రమేష్, వెంకటేశ్వర్లు సుబ్బారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు నాగభూషణం, జయప్రకాష్ పాల్గొన్నారు.



బ్రెడ్ ప్యాకెట్ అందజేస్తున్న నేతలు

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు



తహసీల్దార్‌తో వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నూతన తహసీల్దార్‌గా నియమితులైన అంబటి వెంకటేశ్వర్లును శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు వినోద్‌కుమార్, ప్రదీప్, రాజా, హరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆనంద్

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పాఠశాలల్లో మెరుగైన వసతులను కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. దర్గామిట్టలోని సంక్షేమ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న భోజనం, మెనూ, వసతి సౌకర్యాలపై ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టిక, పలు రిజిస్టర్లు, స్టోర్ రూమ్, విద్యార్థుల గదులు తదితరాలను పరిశీలించారు. ఆరు, పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. రోజువారీ సిలబస్‌తోపాటు విద్యార్థులకు కనీస విషయ పరిజ్ఞానం ఉండేలా ప్రత్యేకంగా స్టడీ అవర్స్‌ను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వసతి గృహానికి అవసరమైన మరమ్మతు పనులను పాఠశాల నిర్వహణ ఫండ్ ద్వారా చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పరిమళ పాల్గొన్నారు.

నేరాల కట్టడికి చర్యలు

• ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): నేరాల కట్టడికి చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. దర్గామిట్ట, వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు చేపడుతున్న చర్యలు.. సిబ్బంది యోగక్షేమాలను ఆరాతీశారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. చోరీ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు సొత్తును రికవరీ చేయాలని చెప్పారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. నెల్లూరు నగర, రూరల్, ఎస్బీ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు రోశయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.